క్లుప్తంగా

శ్రీకాళికాంబాదేవికి ప్రత్యేక పూజలు


శ్రీ కాళికాంబాదేవి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారికి ఒడి బియ్యం పోశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం కాళీమాత సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, దేవస్థానం చైర్మన్ ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, నరసింహ, అంబరేష్, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రహ్మణ్యం శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ లైన్‌మెన్ సేవలు మరువలేనివి


సురేష్‌రాజును సన్మానిస్తున్న ఏఈ రామయ్య

నంద్యాల(అర్బన్): అసిస్టెంట్ లైన్‌మెన్ సురేష్‌రాజు ప్రజలకు అందించిన విద్యుత్ సేవలు మరువలేనివని నంద్యాల విద్యుత్ సబ్ స్టేషన్ డీ2 కార్యాలయ ఏఈ రామయ్య తెలిపారు. డీ2 సెక్షన్ విధులు నిర్వహిస్తున్న సురేష్‌రాజు బదిలీపై మహానంది సెక్షన్‌కు వెళ్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు ఆయనను శాలువాతో సత్కరించి ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీ2 సెక్షన్ లైన్ సెక్టర్ ప్రసాద్, లైన్‌మెన్లు లీలాకుమార్, బాషా, బాలన్న, ఆదాం, రామ్మోహన్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

వెలుగోడు: మండలంలోని రేగడ గూడూరు గ్రామ రైతు సేవ కేంద్రంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటా జొన్నలు రూ.3,371 మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఒక రైతు నుంచి ఎకరాకు 20 క్వింటాళ్ల చొప్పున ఐదు ఎకరాల దిగుబడులను సివిల్ సప్లై శాఖ అధికారులు డీసీఎంఎస్ ద్వారా కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి సివిల్ సప్లై డీఎం రాజు, ఏఓ పవన్, డీసీఎంఎస్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ కోర్సులో ఉచిత శిక్షణ

డోన్ టౌన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగళూరులో కంప్యూటర్ ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఆపైన పాస్ అయిన వారు అర్హులన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. 35 రోజుల కోర్సులో కంప్యూటర్ స్కిల్స్, ట్యాలీ, జీఎస్టీ, స్పోకెన్ ఇంగ్లీషు, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్ తదితర వాటిల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 90004 87423 నంబరును సంప్రదించాలన్నారు.

బైకును ఢీకొన్న కారు

- ఇద్దరికి గాయాలు

డోన్ టౌన్: జాతీయ రహదారి దొరపల్లె క్రాస్ వద్ద శుక్రవారం బైకును కారు ఢీకొనడంతో డోన్‌కు చెందిన రవి, జలదుర్గానికి చెందిన ప్రేమ్‌కుమార్‌లు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. బెంగళూరు నుంచి హైదరాబాద్ వైపు కారు వెళ్తుండగా బాధితులు బైకుపై యు.కొత్తపల్లె దాబా వద్ద టీ తాగి పట్టణంలోకి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం డోన్ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మల్లన్నకు పల్లకోత్సవం


స్వామి అమ్మ వార్లకు పల్లకీ సేవ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు.


శిలువ మోస్తున్న ఏసు పాత్రధారి


గోస్పాడులో ...


ఉయ్యాలవాడ హోసన్నా మందిరంలో ..

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



నంద్యాలలో దైవసందేశం ఇస్తున్న డాక్టర్ ప్రేమవర్ధన్, ప్రత్యేక ప్రార్థనలకు భారీగా హాజరైన క్రైస్తవులు

నంద్యాల(న్యూటౌన్): క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే జరుపుకున్నారు. ఉదయాన్నే చర్చిలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు. ఏసు గీతాలను ఆలపించారు. ముఖ్య ప్రసంగీకులు బైబిల్ చదివి వినిపించారు. శిలువపై ఏసు పలికిన ఏడు బంగారు మాటలను వివరించారు. సమస్త మానవాళి పాప క్షమాపణ కోసం ఏసు ప్రాణత్యాగం చేశారని ఆంధ్ర క్రిస్టియన్ థియాజికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ప్రేమవర్ధన్, నంద్యాల పాస్టరేట్–2 చైర్మన్ రెవరెండ్ ఇమ్మానియేల్, హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్–1 డీనరీ చైర్మన్ జోసెఫ్, పాల్‌రాజారావు, మత్తయి ఆలయం (చిన్నచర్చి) డీనరీ చైర్మన్ నందం ఐజక్, ఆరోగ్యమాత ఆలయం పాస్టర్ మేస ప్రసన్నకుమార్, తెలుగు బాప్టిస్ట్ రక్షణాలయం గురువులు పేర్కొన్నారు. ఆయా మందిరాల్లో ఉదయం 11గంటల నుంచి 3గంటల వరకు క్రైస్తవులు ముగింపు ఉపవాస ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ శిలువపై ఏసు చిందించిన రక్తం ద్వారా మానవాళికి పాప పరిహారం అవుతుందన్నారు. క్షమాపణ, శత్రువులను ప్రేమించడం వంటి సుగుణాలను ఏసుప్రభువు జీవితం ద్వారా గ్రహించాలన్నారు. అనంతరం ప్రార్థనల్లో పాల్గొన్న వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం, మజ్జిగ, నిమ్మరసం, శీతల పానియాలు అందించారు. కార్యక్రమంలో గురువులు విజయ్‌కుమార్, జోయెల్, రవీంద్రనాథ్‌బాబు, పాస్టరేట్–2 సెక్రటరీ కిరణ్‌కుమార్, ట్రెజరర్ బాలయ్య, పాస్టరేట్–3 సాగర్, డయాసిస్ సెక్రటరీ స్టాండ్లీ విలియం, క్రైస్తవులు పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు ఏసును శిలువ వేసే సందేశాన్ని పాస్టర్లు భక్తులకు వివరించారు. మండలంలోని చాపిరేవుల, పెద్దకొట్టాల, పోలూరు, భీమవరం, చాబోలు, మిట్నాల, కొత్తపల్లె, అయ్యలూరు తదితర గ్రామాల్లో వేలాది మంది భక్తులు చర్చిలకు చేరుకొని పాస్టర్ల సందేశం విన్నారు. పోలూరు, పెద్దకొట్టాల, చాపిరేవుల గ్రామాల్లో క్రీస్తు ఏసు శిలువ మోసే సన్నివేశాలు నిర్వహించడంతో గ్రామస్తులు కంటతడి పెట్టారు. కార్యక్రమాల్లో పాస్టరేట్ చైర్మన్ సుమిత్ర, దానియేల్‌పురం పాస్టరేట్ చైర్మన్ కాంతరావు తదితరులు పాల్గొన్నారు.

గోస్పాడు: మండల పరిధిలోని గ్రామాల్లో గుడ్‌ఫ్రైడేనే పురస్కరించుకొని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు శిలువ మార్గం చేశారు. మండల కేంద్రమైన గోస్పాడు ఆర్‌సీఎం చర్చిలో విచారణ గురువులు ఫాదర్ మధుసూదన్‌రెడ్డి, ఫాదర్ బాలస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గోస్పాడు పునీత్ ఆంథోని వారి చర్చి వరకు సెయింట్ ఫ్రాన్సిస్ యూత్ సభ్యులు లిటిల్ ఏంజల్ స్కూల్ నుంచి ఆర్‌సీఎం చర్చి వరకు నాటక రూపంలో శిలువ యాత్ర నిర్వహించారు.

త్యాగానికి ప్రతీక గుడ్‌ఫ్రైడే


క్రిష్టిపాడు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

దొర్నిపాడు: మండలంలో గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశ్వ శాంతికోసం క్రీస్తు శిలువపై చేసిన ప్రాణత్యాగానికి ప్రతీకగా గుడ్‌ఫ్రైడేను జరుపుకుంటారని బోధకులు సంజీవ, తిమ్మయ్య, సుందర్, మనోజ్, ఇమ్మానుయేలు, యోహాను దైవ సందేశం ఇచ్చారు. ఉపవాస ప్రార్థనల అనంతరం ఏడీఏ కుందవరం చెన్నయ్య క్రిష్టిపాడు చర్చిలో భోజనాలు ఏర్పాటు చేశారు.


శిరివెళ్లలో శిలువ మోస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : ఉయ్యాలవాడ హోసన్న ప్రార్థన మందిరంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు సమస్త మానవాళి పాపాలను తొలగించేందుకు క్రీస్తు తన ప్రాణాలను శిలువపై ఉంచారని పాస్టర్లు అన్నారు. అందుకే గుడ్‌ఫ్రైడే రోజు క్రీస్తు శిలువపై పలికిన మాటలను పాస్టర్ జోసఫ్ బాబు భక్తులకు వివరించారు.

శిరివెళ్ల: మండలంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. శిరివెళ్ల, యర్రగుంట్ల, గోవిందపల్లె, బోయలకుంట్ల, కోటపాడు, మహదేవపురం, కామినేనిపల్లె చర్చీలలో క్రైస్తువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామాల్లోని ప్రధాన వీధులలో ఏసు క్రీస్తు శిలువ మోసే ఘట్టాలు జరిగాయి.

15 ఎస్సీ కార్పొరేషన్ యూనిట్ల మంజూరు

శిరివెళ్ల: మండలానికి 15 ఎస్సీ కార్పొరేషన్ యూనిట్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప శుక్రవారం తెలిపారు. యర్రగుంట్ల వివిధ బ్యాంకులకు 8 యూనిట్లు, శిరివెళ్ల బ్యాంక్‌లకు 7 చొప్పున యూనిట్లు మంజూరయ్యాయన్నారు. యూనిట్ల స్థాపనపై ఆసక్తి, అర్హత గల యువతీ, యువకులు మే 10లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మిగతా వివరాలకు ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నంద్యాలలో నేడు రన్‌ఫర్ జీసెస్ ర్యాలీ

నంద్యాల(న్యూటౌన్): ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని నంద్యాలలో శనివారం ఉదయం 6 గంటలకు రన్‌ఫర్ జీసెస్ నిర్వహిస్తున్నట్లు క్రిస్టియన్ వెల్ఫేర్ అండర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యులు కె.జోసెఫ్, పాస్టర్ అన్నాస్, ఏసుదాసు, ప్రెసిడెంట్ రవికుమార్ అన్నారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను క్రైస్తవ సంఘాల ప్రతినిధులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రన్‌ఫర్ జీసెస్ ర్యాలీని హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్–1(పెద్దచర్చి) ఆలయం నుంచి ఉదయం 6గంటలకు ప్రారంభమై సంజీవనగర్ గేట్, శ్రీనివాససెంటర్, సాయిబాబానగర్, ఆర్ఎస్ రోడ్డు మీదుగా పెద్దచర్చి వరకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శాస్త్రోక్తంగా దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ఠోత్సవం


పోలేరమ్మ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని ఎల్లావత్తులలో శుక్రవారం శాస్త్రోక్తంగా పోలేరమ్మ, పుట్టాలమ్మ, పెద్దమ్మ, లక్ష్మీనరసింహ, చెన్నకేశవ, నాగలింగేశ్వర స్వామి అమ్మ వార్ల నూతన విగ్రహ, ధ్వజ, శిఖర కలశ ప్రతిష్ఠోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి వేద పండితుల మంత్రోచ్చారణలతో సాగిన ఈ కార్యక్రమం చివరలో భక్తాదులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మెన్లు గంధం రాఘవరెడ్డి, ఎర్రం నర్సిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మదార్ సాహెబ్‌తో పాటు గ్రామ నాయకులు పాల్గొని నూతనంగా ప్రతిష్ఠించిన స్వామి అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవం సందర్భంగా గ్రామ పెద్దలు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించారు.

● అడుగంటుతున్న జలాలు


డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలోని బావిలో అడుగంటిన నీరు

దొర్నిపాడు: ఇన్నాళ్లు చెరువులు, కుంటలు, బావులు నీళ్లతో నిండుగా ఉండేవి. అయితే, ఈఏడాది వాటిలో జలాలు అడుగంటాయి. ఇప్పటికే ఉపాధి హామీ పనుల ద్వారా చేసిన నీటి కుంటలు పూర్తిగా ఎండిపోయాయి. మేతకు వెళ్లిన పశువుల సైతం నీరులేక ఇబ్బంది పడుతున్నాయి. గతంలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ రాలేదని పశుపెంపకం దారులు పేర్కొంటున్నారు.

ప్రాథమిక తరగతుల విలీనాన్ని రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

నంద్యాల(న్యూటౌన్): 1, 2 తరగతులను కూడా హైస్కూళ్లలో విలీనం చేయడం సబబు కాదని ఎస్‌టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రాథమిక తరగతులను హైస్కూళ్లలో విలీనం చేస్తే ప్రాథమిక విద్యావ్యవస్థ నిర్వీర్యమయ్యే అవకాశం ఉందన్నారు. ఉపాధ్యాయులను కేటాయించే సందర్భంలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని చూడకూడదన్నారు. సమావేశంలో ఎస్‌టీటీఎఫ్ నాయకులు రాము, రవీంద్రబాబు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు


తలపడుతున్న క్రీడాకారులు

బేతంచెర్ల: పట్టణంలోని చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్థానిక శేషారెడ్డి హైస్కూల్ మైదానంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఎస్ఐ రమేష్ బాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బుగ్గన ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. 16 జట్లు పాల్గొన్నాయి.

21న రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

ఆత్మకూరు: మండలంలోని కరివేన గ్రామంలో ఈస్టర్‌ను పురస్కరించుకుని ఈనెల 21న రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు సీఎస్ఐ ప్రార్థనా మందిరం సంఘం పెద్దలు తెలిపారు. పోటీల ప్రారంభ కార్యక్రమానికి రావాల్సిందిగా డీఎస్పీ రామాంజినాయక్‌ను, సీఐ రామును కలిసి శుక్రవారం ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యూ కేటగిరీ వృషభాలకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.15 వేలు, ఆరో బహుమతి రూ.10 వేలు, ఏడో బహుమతి రూ.5 వేలు చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న ఎడ్ల యజమానులు రూ.600 ప్రవేశ రుసుం చెల్లించి రశీదు పొందాలన్నారు. మరిన్ని వివరాలకు 6281655869 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్–6 హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఈనెల 21వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి ఎం.శంకర్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి పదినెలలు కావస్తున్నా బాబు సర్కారు ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు, తదితర పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. లేకపోతే ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి చౌడప్ప, పీడీఎస్‌యూ నాయకులు రాంబాబు, ఆటో కార్మిక సంఘం నాయకులు రాజు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

గడ్డి వామి దగ్ధం

బండిఆత్మకూరు: మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన రైతు శాంసన్ గడ్డి వామి దగ్ధమైంది. శుక్రవారం మధ్యాహ్నం గడ్డివామి నుంచి మంటలు ఎగిసి పడటాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలకు ఆర్పివేశారు. ప్రమాదంలో రూ.50 వేల విలువైన గడ్డి అగ్నికి ఆహుతైనట్లు రైతు పేర్కొన్నాడు.


చాగలమర్రి మండలం తోడేండ్లపల్లె గ్రామంలో గాలివానకు నేలకొరిగిన మొక్కజొన్న పంట


గోస్పాడు మండల శివారులో నేలకొరిగిన వరిపైరు

గాలివాన బీభత్సం..రైతుకు తీరని నష్టం

అకాల వర్షాలు రైతులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. శుక్రవారం నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో గాలివాన బీభ్సతం సృష్టించింది. ఉపరిత ద్రోణి ప్రభావంతో ఉదయం ఎండ తీవ్రతతోపాటు ఉక్కపోత అధికంగా ఉండి సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఇది వేసవి నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించినా రబీ రైతులకు నష్టాన్ని చేకూర్చింది. ఆయా నియోజకవర్గాల్లో వరి, మొక్కజొన్న కోత, నూర్పిడి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ధాన్యాన్ని రైతులు కల్లాల్లో, రహదారులపై ఆరబోసుకున్నారు. అకాల వర్షం పడటంతో కొన్ని ప్రాంతాల్లో ధాన్యం తడిచిపోగా మిగిలిన చోట్ల దిగుబడులు వర్షానికి తడవకుండా పట్టలు కప్పుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. చాగలమర్రి మండలంలో మొక్కజొన్న పంట, రుద్రవరం మండలంలో బొప్పాయి పంట నేలకొరిగింది. –గోస్పాడు/రుద్రవరం/చాగలమర్రి


రుద్రవరం మండలం ఆలమూరులో గాలికి విరిగిపడిన బొప్పాయి చెట్లను చూపుతున్న రైతు


గోస్పాడు.. వర్షానికి మిరప దిగుబడి తడవకుండా పట్టలు కప్పుతున్న రైతులు



